తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

బుధవారం
25 నవంబర్ 2026

పేజీలు : 8



వైద్య మండలి సంతకాలే

ప్రశ్నార్థకం!

- సదరం ధృవీకరణ పత్రాల మాయాజాలంపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- వైకల్యం లేకున్నా 50 శాతానికి పైగా శాశ్వత ధృవీకరణలు?
- దళారుల చేతివాటమా? వైద్యుల నిర్లక్ష్యమా?
- రాష్ట్ర స్థాయి బృందంతో పునఃపరిశీలనకు ప్రజల డిమాండ్





మాడుగులపల్లి నవంబర్ 24 (జనంసాక్షి):
మాడుగులపల్లి మండలంలో దివ్యాంగుల పింఛన్ల అక్రమాల వ్యవహారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది కేవలం క్షేత్రస్థాయిలో పింఛన్ల మంజూరు వరకే పరిమితం కాకుండా, అసలు వైకల్యాన్ని నిర్ధారించే జిల్లా ఆసుపత్రి వైద్య మండలి జారీ చేసిన సదరం ధృవీకరణ పత్రాల ప్రామాణికతపైనే ఇప్పుడు తీవ్ర సందేహాలు వ్యక్తమవుతున్నాయి ఎలాంటి శారీరక లేదా వినికిడి లోపం లేని వ్యక్తులకు సైతం 50 శాతానికి పైగా శాశ్వత వైకల్యం ఉన్నట్లు, పైగా భవిష్యత్తులో మళ్లీ పరీక్షించాల్సిన అవసరం లేదంటూ ధృవీకరణ పత్రాలు జారీ కావడం మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

కంటికి కనిపించని వైకల్యాల పేరిట మాయాజాలం
మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాలలో జారీ అయిన కొన్ని సదరం ధృవీకరణ పత్రాల తీరును పరిశీలిస్తే విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయటికి స్పష్టంగా కనిపించే వైకల్యాలు కాకుండా, కేవలం వైద్య పరీక్షల ద్వారా మాత్రమే నిర్ధారించగలిగే వినికిడి లోపం, అలాగే నాలుగు అవయవాల్లో కండరాల బలహీనత వంటి విభాగాలను అక్రమార్కులు ఆసరాగా చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం గ్రామాలలో అందరితో పాటు సాధారణంగా తిరుగుతూ, స్పష్టంగా మాట్లాడుతూ, వింటూ, తమ పనులు తాము చేసుకునే వ్యక్తులకు సైతం 51 శాతం నుంచి 53 శాతం వరకు శాశ్వత వైకల్యం ఉన్నట్లు ధృవీకరణ పత్రాలు జారీ కావడం చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

అసలు పరీక్షలు జరిగాయా? తెరవెనుక ఏం నడిచింది?
సదరు ధృవీకరణ పత్రాలపై జిల్లా స్థాయి వైద్య నిపుణులు, విభాగాధిపతులు, ఆసుపత్రి పర్యవేక్షకుల స్థాయి అధికారుల సంతకాలు ఉండటంతో ఈ వ్యవహారం మరింత సంచలనంగా మారింది. నిబంధనల ప్రకారం వినికిడి లోపం నిర్ధారించాలన్నా, కండరాల బలహీనతను తేల్చాలన్నా కచ్చితమైన శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. మరి, వైకల్యం లేని వ్యక్తులకు అంత పెద్ద మొత్తంలో వైకల్య శాతం ఎలా నిర్ధారించారు? వైద్య మండలి ఎదుట అసలు పరీక్షలు సక్రమంగా జరిగాయా? లేక దళారుల ముఠా చెలరేగి తెరవెనుక భారీ ఎత్తున చేతివాటం ప్రదర్శించిందా? అన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి మళ్లీ పరీక్షించాల్సిన అవసరం లేదు అని ధృవీకరణ పత్రాలలో పేర్కొనడం వెనుక భవిష్యత్తులో ఎవరూ ప్రశ్నించకుండా ముందుజాగ్రత్త పడ్డారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

నిజమైన దివ్యాంగులకు కన్నీళ్లే మిగులుతున్నాయి
ఒకవైపు అక్రమార్కులు దొడ్డిదారిన సదరం ధృవీకరణ పత్రాలు సంపాదించి ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ దర్జాగా పింఛన్లు పొందుతుంటే, మరోవైపు పుట్టుకతోనే వైకల్యం ఉన్నవారు, ప్రమాదాల్లో కాళ్లు చేతులు కోల్పోయిన నిరుపేదలు మాత్రం పింఛన్ల కోసం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కన్నీరు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అర్హులకు సాంకేతిక కారణాలు చూపుతూ మొండిచేయి చూపుతున్న యంత్రాంగం, అనర్హుల విషయంలో కళ్లు మూసుకుని ఆమోదం తెలపడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
ఈ వ్యవహారంలో కేవలం లబ్ధిదారుల పింఛన్లు రద్దు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, తప్పుడు ధృవీకరణ పత్రాలు జారీ కావడానికి కారణమైన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు, మండల వాసులు డిమాండ్ చేస్తున్నారు జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి– మాడుగులపల్లి మండలంలో మాడుగుల పల్లి గ్రామంలో జారీ అయిన అనుమానాస్పద సదరం ధృవీకరణ పత్రాలన్నింటినీ హైదరాబాద్ వంటి రాష్ట్ర స్థాయి నిపుణులైన వైద్య బృందంతో పునఃపరిశీలన చేయించాలని కోరుతున్నారు సమగ్ర విచారణ జరిపితే అసలు బండారం బయట పడుతుందని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

కార్తీక దీపాల కాంతులతో శ్రీ మార్కండేశ్వర దేవాలయం



చండూరు,నవంబర్ 24 (జనంసాక్షి)
చండూరు పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పౌర్ణమి సందర్భంగా అర్చకులు గుర్రం సత్యనారాయణ పంతులు స్వామివారికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల శివనామస్మరణతో, దీపాల కాంతులతో దేవాలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



శివనామ స్మరణతో మారుమోగిన మధిర శివాలయం

మధిర, నవంబర్ 24 (జనంసాక్షి): కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని వైరా నదీతీరాన కొలువై, చిన్న కాశి అని పిలవబడే శ్రీ మృత్యుంజయ స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారు జాము నుండే పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుండి భక్తులు పిల్లాపాపలతో భారీగా తరలివచ్చారు. ?భక్తులు ముందుగా వైరా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి, నదీ తీరాన కార్తీక దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోకి చేరుకుని స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి సత్యనారాయణ శర్మ వారి ఆధ్వర్యంలో భక్తులకు పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపారాధనలు చేయడంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ నిర్వాహకులు ఎండోమెంట్ ఈవో రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎండోమెంట్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రజల ఆనందోత్సాహాల మధ్య సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

కొండమల్లేపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి):
కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కార్తీక పౌర్ణమి శుభవేళ గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, జిల్లా మండల స్థాయి ఉన్నతాధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సంఘాల ముఖ్య నాయకులు, యువత, ఆయన ఆత్మీయ శ్రేయోభిలాషుల ఆనందోత్సాహాల మధ్య సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా ఘనంగా జరిగాయి. కొండమల్లేపల్లి గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు, యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డికి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించి అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొండమల్లేపల్లి గ్రామ అభివృద్ధికి ఆయన కృషి అభినందనీయమని గ్రామంలో రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం, పట్టణంలోని సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి అభివృద్ధి పనుల్లో సర్పంచ్ యుగేందర్ రెడ్డి చూపుతున్న చొరవను గ్రామస్తులు



కొనియాడారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించే మంచి నాయకుడని ప్రశంసించారు.
సర్పంచ్ మా కుటుంబ సభ్యుడిలా ఉంటారని గ్రామ అభివృద్ధి కోసం రాత్రి పగలు కష్టపడుతున్నారని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి అయన చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన సేవలు కొనియాడారు. అనంతరం సర్పంచ్ జన్మదిన సందర్భంగా సోలిడార్ పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించారు. శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర దేవాలయంలో అయ్యప్ప ఆంజనేయ స్వాములు సర్పంచ్ పసునూరి యుగేంధర్ రెడ్డికి ప్రత్యేక దీవెనలు అందించి దేవాలయ ప్రాంగణంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డికి భగవంతుడు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



భీమలింగం క్షేత్రంలో కార్తీక పౌర్ణమి వైభవం..
పోటెత్తిన భక్తజనం
మూసీ నదిలో పుణ్యస్నానాలు.. దీపాలతో వెలిగిన నదీ తీరం

వలిగొండ, నవంబర్ 24 (జనంసాక్షి)
కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సంగెం సమీపంలోని శ్రీ భీమలింగేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు మూసీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అరటి దొన్నెలలో కార్తీక దీపాలు వెలిగించి నదిలో వదిలారు. అనంతరం భీమలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో సంగెం క్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



హైకోర్టు న్యాయమూర్తి
జస్టిస్ కూనూరు లక్ష్మణ్ గౌడ్ కు పితృ వియోగం
నివాళులర్పించిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే లు

రామన్నపేట, నవంబర్ 24 (జనంసాక్షి):
రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ తండ్రి కూనూరు గోపాల్ బోగారం మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గుంతకంట్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డితో పాటు పలువురు నాయకులు గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జస్టిస్ లక్ష్మణ్ గౌడ్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం సర్పంచులు కూనూరు సాయికుమార్, గర్దాస్ విక్రమ్, పులిపలుపుల వీరస్వామి మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం, ఎండి ఆమీర్ జిల్లా నాయకులు బద్దుల రమేష్, అంతటి రమేష్, కాలే శ్రవణ్, ఎస్.కె చాంద్ నాయకులు కూనూరు ముత్తయ్య, బండ శ్రీనివాసరెడ్డి, బైకాని మహేష్, బోయపల్లి నాగరాజు, ఆవుల శ్రీధర్, బొలుగుల కృష్ణ, కోడి పాండు, బొడ్డుపల్లి రాజు, నల్ల సైదులు, జిల్లా శ్రీనివాస్, అంతటి మల్లేశం, గణేష్, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట నుండి దంతాలపల్లి వరకు
నాలుగులైన్ల రోడ్డుగా మార్చాలి
తాత్కాలిక మరమత్తులు వద్దు..
శాశ్వత పరిష్కారం కావాలి



సూర్యాపేట(జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని కుడకుడ రోడ్డు నుండి దంతాలపల్లి వరకు నాలుగు లైన్ల రోడ్ గా మార్చాలని, దుమ్ము ధూళి నుండి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ సూర్యాపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కుడకుడ రోడ్ లోని క్రికెట్ స్టేడియం వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎర్ర అఖిల్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ నుండి దంతాలపల్లి వరకు ఉన్న నాలుగు లైన్లుగా మార్చాలని అనేక సార్లు తమ పార్టీ ద్వారా వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.తాత్కాలికంగా మరమత్తులు చేస్తున్నారు కానీ మళ్లీ రెండు మూడు రోజుల తరువాత రోడ్లు గుంతలు పడి ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని తెలిపారు.నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకల కారణంగా నిత్యం దుమ్ము ధూళితో ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు.అనేక మంది అనేక రకాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి నాలుగు లైన్ల రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, టియుసిఐ జిల్లా అధ్యక్షులు గొడ్డలి నర్సయ్య, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు మారసాని చంద్రకళ, జిల్లా సహాయ కార్యదర్శి సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, నాయకులు రాంజీ, శేషగిరి, మోహన్, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు భీమనపల్లి ప్రకాష్, సహాయ కార్యదర్శి ఉత్తరాది నితిన్, నవీన్, పద్మ, గౌరమ్మ, రేణుక, రహమతి, రాబర్ట్, సైదులు, ఉప్పలయ్య, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుతో లాభాలు

జాజిరెడ్డిగూడ(జనంసాక్షి):
ఎల్‌నినో వలన వర్షాలు పడక కరువు ఏర్పడినందున రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగుచేసి లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి పి.గణేష్ కోరారు. మంగళవారం వేల్పుచర్ల గ్రామంలో సాగుకాని వ్యవసాయ భూములను పరిశీలించి రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో సాగవుతున్న కంది, ఇతర ఆరుతడి పంటలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ సత్యం, వార్డు సభ్యుడు మధుసూదన్, రైతులు ఖమ్మంపాటి జానయ్య,



చిక్కుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ సేవా సమితి సేవలు అభినందనీయం
- సినీ నిర్మాత అప్పిరెడ్డి, నటి శివపార్వతి
- 800 మంది పేద మహిళలకు ఉచితంగా చీరల పంపిణీ



మునగాల, నవంబర్ 24(జనంసాక్షి):
కోదండరామ సేవా సమితి పేరుతో గత 16 సంవత్సరాలుగా దాతల సహకారంతో పేదలకు నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రముఖ సినీ నిర్మాత అప్పిరెడ్డి, నటి శివపార్వతి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నరసింహపురం గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి తిరుకళ్యాణాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏడు గ్రామాలు నర్సింహాపురం, ఆకుపాముల, కోదండరామాపురం, ముకుందాపురం, బరాఖత్ గూడెం, చిలుకూరు మండల పరిధిలోని రామాపురం, ఆర్లగూడెంకు చెందిన సుమారు 800 మంది పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అప్పిరెడ్డి, శివపార్వతి మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దైవ కార్యాలతో పాటు పేదలకు అండగా నిలుస్తూ 16 ఏళ్లుగా సేవా సమితిని నడిపిస్తున్న సర్పంచ్ వేమూరి సత్యనారాయణ, సభ్యుల సేవాభావం ఇతరులకు ఆదర్శమన్నారు. పేదల సంక్షేమం కోసం సర్పంచ్ వేమూరి సత్యనారాయణ చేస్తున్న కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అన్నపురెడ్డి వెంకటరెడ్డి, జిల్లా డాక్టర్ సెల్ ఉ వైద్య ఆరోగ్య శాఖ చైర్మన్ జనపనేని భార్గవ్, వేముల వెంకటేశ్వర్లు, ప్రముఖ రంగస్థల నటుడు డాక్టర్ గుంటి పిచ్చయ్య, చక్రధర్ రావు, జల్లా జనార్ధన్ రావు, డీసీ వెంకటేశ్వర రెడ్డి, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

సూర్యాపేట (జనంసాక్షి):
జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో గల శ్రీరామలింగేశ్వర సహిత త్రిశక్తి అయ్యప్ప ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో మంగళవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలలో భాగంగా స్వామివారిని ప్రత్యేక అలంకరణ చేశారు.ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.మహిళలు కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య,ధర్మకర్తలు అనంతుల సూర్యనారాయణ, అనంతుల దుర్గాప్రసాద్, అనంతుల శ్రీనివాస్, డాక్టర్ అనంతుల అనూష, అనంతుల సందీప్, యుగేందర్,రాజయ్య, ,వాసుదేవరావు, వెంకన్న, ప్రభాకర్, కృష్ణ, భరత్, ఉపేందర్ రావు,సత్యంబాబు, తోట శ్యామ్ ప్రసాద్,నాగేందర్, రమేష్, శంకర్, అర్చకులు దుర్గాప్రసాద్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఖదీర్ బేగును పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట, నవంబర్ 24 (జనంసాక్షి):



రామన్నపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మీర్జా ఖదీర్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని మరియు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఖదీర్ బేగ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ పరంగా ఆయనకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్, జిల్లా డిసిసి కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఎండి జమీరుద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్,ఉపసర్పంచ్ మోటే రమేష్,మాజీ సర్పంచ్ గుత్తా నర్సిరెడ్డి, బొడ్డు సురేందర్ రావు,రామిని రమేష్, ఎండి అక్రమ్, గొలుసుల ప్రసాద్, మీర్జా ఇనాయత్ బేగ్ తదితరులు ఉన్నారు.

సదర్ ఉత్సవ కరపత్రాల పంపిణీ

మాడుగులపల్లి నవంబర్ 24 (జనం సాక్షి):



ఈ నెల 28న మిర్యాలగూడలో గంగుల అంజలి యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న శ్రీ కృష్ణ సదర్ ఉత్సవం కరపత్రాలను మంగళవారం గండ్రవాణిగూడెం పంచాయతీ ఆవరణలో పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవుల సంస్కృతి సంప్రదాయాలు, ఐక్యత, ఆత్మగౌరవానికి సదర్ ఉత్సవం ప్రతీక అని అన్నారు ఉత్సవాన్ని భావితరాలకు అందించేందుకు మండలంలోని యాదవులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గండ్రవాణిగూడెం సర్పంచ్ బొబ్బలి కావ్య శ్రీనివాస్ యాదవ్, దాచారం సర్పంచ్ బెల్లి జానయ్య యాదవ్, మండల యాదవ సంఘం అధ్యక్షులు ఊరిబండి సైదులు యాదవ్, నన్నెబోయిన లింగయ్య యాదవ్, బొబ్బలి నరేష్ ఇతర యాదవ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

దీపకాంతులతో వెలిగిపోయిన శివాలయాలు

కొండమల్లేపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి):



కొండమల్లేపల్లి పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మహిళలు పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగిస్తూ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు తరలివచ్చి ఉపవాస దీక్షలతో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పట్టుచీరలు ధరించి, దీపాలు వెలిగించి, కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు. శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయ ఆలయ ప్రాంగణమంతా దీపాల వెలుగులతో పూల అలంకరణలతో కళకళలాడింది. ఓం నమశివాయ నామస్మరణతో ఆలయాలు మారుమోగిపోయాయి. కార్తీక మాసంలో దీపాలు వెలిగిస్తే పాపాలు పోయి పుణ్యం వస్తుందని భక్తుల అపార నమ్మకం. కార్తీక పౌర్ణమి రోజు ఇంటిల్లిపాది వచ్చి పూజల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలవకుండా పోలీసులు ప్రత్యేకంగా ఆలయాలను పర్యవేక్షించారు.

రామన్నపేట మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు..

శివాలయాలకు పోటెత్తిన భక్తులు..

రామన్నపేట, నవంబర్ 24 (జనంసాక్షి):



రామన్నపేట మండలంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మహాదేవుని దర్శించుకున్నారు. ఆయా శివాలయాలతో పాటు తమ ఇళ్ల వద్ద కార్తీక దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం పురస్కరించుకుని ఉదయం గణపతి పూజ, నవగ్రహ పూజ, మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ఉసిరి, పిండి ప్రతిమలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్ కాంతులతో ఆలయాన్ని అలంకరించారు. స్వామివారిని ఊరేగింపుగా తీసుకొని జ్వాలాతోరణం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి శ్రీ పార్వతీ పరమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాపోలు రమేష్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ అప్పం రామేశ్వరం ఆలయ ధర్మకర్తలు బలుగూరి లింగస్వామి, కొంగరి జంగయ్య, అప్పం గణపతి, ఏళ్ల సునీత వార్డ్ మెంబర్ కంకల అర్చన మల్లేశం, పగడాల సత్తయ్య, కూనూరు వెంకటేశం, నన్నూరి సత్తిరెడ్డి, చెన్నోజు చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

కార్తీకదీపాలతో శోభాయమానంగా సదాశివ ఆలయం

రామన్నపేట, నవంబర్ 24 (జనంసాక్షి):



రామన్నపేటలోని శ్రీ సదాశివ దేవాలయంలో తెల్లవారుజాము నుంచే కార్తీకదీపం సందడి నెలకొంది. భక్తుల రాకతో ఆలయం కోలాహలంగా మారింది.ఆలయ పూజారి శశిధర్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కీర్తనలతో ఆలయంలో భక్తిభావం నెలకొంది.

కార్తీకదీపం విశిష్టత:
కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో శివాలయంలో దీపం వెలిగించడం, ఉసిరికాయ దీపం పెట్టడం, 365 వత్తుల దీపం వెలిగించడం ఆనవాయితీ. కార్తీక పౌర్ణమి నాడు శివాలయంలో దీపోత్సవం నిర్వహిస్తారు.

శివాలయంలో జరిగే పూజలు:
తెల్లవారుజామునే స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. అనంతరం అలంకారం చేసి మహా హారతి ఇచ్చారు. భక్తులు ఉపవాసం ఉండి స్వామివారికి అభిషేకం, అర్చనలు చేయించుకున్నారు.
ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణతో ఆలయం దీపకాంతులతో వెలిగిపోయింది. భజన బృందాల భజనలు, కీర్తనలతో భక్తిభావం నెలకొంది.
అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఆర్థిక సమగ్రతపై ప్రత్యేక శిబిరం

చింతకాని, నవంబర్ 24 (జనం సాక్షి)
కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సమగ్రత ప్రత్యేక ప్రచారంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బస్వాపురం శాఖ ఆధ్వర్యంలో రేపు ఉదయం 10:30 గంటలకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం రీజినల్ హెడ్ కె. వెంకట్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శిబిరంలో బీమా పథకాల నమోదు, ఆధార్ సీడింగ్, ఐజఅ, కొత్త ఖాతాల ప్రారంభం, ఐఅఅ దరఖాస్తులు, నామినీ వివరాల నవీకరణ తదితర బ్యాంకింగ్ సేవలు అందించనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భద్రాచలం, నవంబరు 24 (జనంసాక్షి):
భద్రాచలంలోని అశోకనగర్ కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అశోకనగర్ కాలనీకి చెందిన మహేష్ (35) ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు తెరిచి చూడగా మహేష్ అప్పటికే మృతి చెంది కనిపించాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా, మృతుడి తల్లి సత్యవతి అమలాపురం వెళ్లడంతో మహేష్ ఇంట్లో ఒంటరిగా ఉంటున్నట్లు తెలిసింది. అతడి మృతికి గల కారణాలు ఏమిటి? ఎప్పుడు మృతి చెందాడు? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనం సీజ్

16 ఎద్దులు, ఆరు ఆవులు

ముగ్గురు అదుపులో, నలుగురిపై కేసు నమోదు

టేకులపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి):
అక్రమంగా డీసీఎం వాహనంలో 16 ఎద్దులు, 6 ఆవులను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, పరారీలో ఉన్న మరో వ్యక్తి తో నలుగురు మీద కేసు నమోదు చేసి, డీసీఎం వాహనాన్ని సీజ్ చేసినట్లు టేకులపల్లి ఎస్సై కే తిరుపతి తెలిపారు. అక్రమంగా డీసీఎం వాహనం లో 16 ఎద్దులు, 6 ఆవులను ఒరిస్సా రాష్ట్రము నుండి హైదరాబాద్ కి తరలిస్తుండగా మంగళవారం టేకులపల్లి లో వాహన తనిఖీలలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులు
1. జలా రాజు R/o సరూర్ నగర్ 2. ఉదరా భరత్R/o తట్టినాగారం, రంగారెడ్డి 3. కంగుల రాజు
4. జబ్దార్ హరిజను R/o ఒడిస్సా నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



28న సూర్యాపేటలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

సూర్యాపేట(జనంసాక్షి): సూర్యాపేట జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబురాల వేదికగా జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలను ఎంపిక చేసినట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు గోళ్ళమూడి రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలల జట్లకు ఈ జిల్లా స్థాయి చెకుముకి వేడుకలలో పాల్గొనే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.ప్రతి మండలం నుండి ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ విభాగాల వారీగా నాలుగు టీమ్స్ చొప్పున 63 బృందాలలో 192 మంది విద్యార్థులు ఈ సైన్స్ సంబురాలలో పాల్గొంటున్నారని అన్నారు.జనవిజ్ఞాన వేదిక నేతృత్వంలో విద్యాశాఖ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఈ చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులతోపాటు ప్రధానోపాధ్యాయు లను, ఉపాధ్యాయులను కూడా భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను

విజయవంతం చేయాలి

డిసిసి ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వేమన్ రెడ్డి



కొండమల్లేపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం లోని హాజీపూర్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఊట్కూరి వేమన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ నాయకత్వంలో కొండమల్లేపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో ఉమ్మడి మహబూబ్‌నగర్ నల్గొండ జిల్లాల ప్రాంతీయ అభివృద్ధికి మరిన్ని శుభ పరిణామాలు తోడవుతాయని కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన పేర్కొన్నారు.

కిష్టారం గ్రామ యువతకు వాలీబాల్

అందజేసిన బోడు ఎస్‌హెచ్‌ఓ ఎం. రాజమౌళి

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువతకు క్రీడలపై అవగాహన

టేకులపల్లి, నవంబర్ 24(జనంసాక్షి):

టేకులపల్లి మండలంలోని బోడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల కిష్టారం గ్రామ యువతకు బోడు ఎస్ హెచ్ ఓ ఎం రాజమౌళి వాలీబాల్ కిట్టు ను అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోడు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం. రాజమౌళి కిష్టారం గ్రామంలో యువతకు అవగాహ న కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు వాలీబాల్‌ను అందజేశారు.యువత చెడు వ్యసనా లకు,గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని సూచించారు.అలాగే గ్రామీణ యువత తమ ఖాళీ సమయాన్ని క్రీడలకు, చదువుకు, ఉద్యోగ అవకాశాల సాధనకు వినియోగించుకోవాలని కోరారు.యువత సన్మార్గం లో నడుస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు.ప్రజలకు, ముఖ్యంగా యువతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.





బాడీ లారీలకు బొగ్గు లోడింగ్ ప్రారంభంతో టియుసిఐ హర్షం

టేకులపల్లి,నవంబర్ 24(జనంసాక్షి):

ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో కోయగూడెం ఓసి నుండి బాడీ లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని వినతి మేరకు సోమవారం నుండి బాడీ లారీలకు బొగ్గు లోడింగ్ చేపట్టినందుకు టి యు సి ఐ హర్షం వెల్లుబుచ్చారు. మంగళవారం కోయగూడెం ఓసి జంక్షన్ వద్ద లారీ యార్డులో లోడింగ్ అన్ లోడింగ్ తార్పాలిన్ కార్మికుల సమావేశం పూనెం రామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాకుబ్ షావలి,మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న పాల్గొని మాట్లాడుతూ ఇల్లందు జిఎం కోయగూడెం ప్రాజెక్ట్ ఆఫీసర్ (పిఓ)లకు కృతజ్ఞతలు తెలిపారు.లో గ్రేడ్ పర్మిట్లు లేవని, బొగ్గు యాక్షన్ లో గత రెండు నెలల నుండి పెట్టడం లేదని, యాడ్ లో కూడా బొగ్గు లేదని ఈఓసి మీద ఆధారపడి జీవిస్తున్న అందరూ ఆందోళన చెందుతున్నారని అన్నారు.కొత్తగా ఓబీ టెండర్ పొందిన హెచ్చి యాజమాన్యం ఓబీ పనులు ప్రారంభించి పాత కార్మికులనే పనిలోకి తీసుకోవాలని కోరారు.సర్ఫేస్ మైనర్ త్వరితగతిన ఏర్పాటు చేసి ఉన్న కోల్ బెంచ్ ద్వారా బొగ్గు బయటికి తీసుకొచ్చే పనులు వేగవంతం చేయాలని కోరారు. ఈ ఓసి మీద ఓబి కార్మికులు థార్పాలిన్ కార్మికులు, బాడీ టిప్పర్ లారీ, ఓనర్ కం డ్రైవర్లు క్లీనర్లు గుమస్తాలు సుమారు 1,500 మంది ఈ ఓసి మీద ఆధారపడి జీవించే కుటుంబాలు ఉన్నాయ న్నారు. ఇప్పటికే ఫైనాన్స్ ద్వారా లారీలు తెచ్చుకు న్న ఓనర్లు అన్ని తాకట్టు పెట్టుకొని కొనుక్కున్నారని, కొత్తగా వచ్చిన ఓబీ యాజమాన్యం ఎప్పుడు ప్రారంభమైతదోనని ఆవేదన చెందుతున్నారని అన్నారు. సింగరేణి అధికారులు బొగ్గు ప్రారంభ పనులను వేగవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో టి యు సి ఐ ఏరియా కార్యదర్శి జరుపుల సుందర్, పుల్లయ్య, సతీష్, పాపయ్య, ప్రకాష్, రాజు, రామకృష్ణ, నరసింహారావు ముతేష్, సుధాకర్, రామస్వామి, సమ్మయ్య,రాజేష్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధమైన పాలన కోసమే నా పోరాటం

పార్టీల ప్రభావం, ప్రలోభాలకు అతీతంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు మళ్లీ ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు: నలమాస కృష్ణ గౌడ్

ఖమ్మం, నవంబర్ 24, (జనంసాక్షి)

రాజ్యాంగబద్ధమైన పాలన, సామాజిక న్యాయం, పట్టభద్రుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగాఖమ్మం?వరంగల్?నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు హైకోర్టు న్యాయవాది నలమాస కృష్ణ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రభావం, డబ్బు, కుల సమీకరణాలకు అతీతంగా పట్టభద్రుల గొంతుకగా శాసనమండలిలో నిలబడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు.మంగళవారం ఖమ్మం నగరంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనది మూడు దశాబ్దాల ప్రజా ఉద్యమ ప్రస్థానమని, విద్యార్థి ఉద్యమాలు, తెలంగాణ ఉద్యమం, సామాజిక న్యాయ పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నానని తెలిపారు. అవినీతి, అక్రమాలు, అన్యాయాలపై పోరాడుతూ అనేక కేసులు ఎదుర్కొన్నానని చెప్పారు. గతంలో ఎమ్మెల్సీలుగా పనిచేసినవారు పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతవరకు కృషి చేశారో ప్రజలు సమీక్షించుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గతంలో ఇచ్చిన ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి తదితర హామీలను అమలు చేయకుండా మళ్లీ ఓట్లు అడగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉన్నత విద్యలు అభ్యసించిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.ఎన్నికల్లో డబ్బు, కుల బలం, రాజకీయ పలుకుబడికి కాకుండా అభ్యర్థుల వ్యక్తిత్వం, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై అవగాహనకు పట్టభద్రులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో అవినీతి వ్యవస్థీకృతమై సామాన్యులకు లంచం లేకుండా పనులు జరగని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దల అవినీతిని కాపాడేందుకు చిరుద్యోగుల పై దాడి చేస్తున్నారని, ప్రభుత్వ యంత్రాంగంలో వ్యవస్థాగతమైన అవినీతి ఫలాల్లో పెద్దలకు వాటాలు లేవా అని ప్రశ్నించారు. కులవృత్తులు, వెనుకబడిన వర్గాల జీవనాధారాల పరిరక్షణతో పాటు సమసమాజ నిర్మాణానికి పాలకులు కృషి చేయాలని అన్నారు.తనకు రాజకీయ అండదండలు, ఆర్థిక బలం లేకపోయినా ప్రజా ఉద్యమాల్లో తనతో కలిసి పనిచేసిన మేధావులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహంతో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన లో ఏ నినాదాలు డిమాండ్ లు లేవనెత్తామో తెలంగాణ సాధించిన తర్వాత కూడా ఆ నినాదాలు అపరిష్కృతంగా ఉన్నాయి. రాష్ట్ర సాధన ఉద్యమమే మొత్తంగా భారత ప్రభుత్వానికి అంటే రాజ్యానికి వ్యతిరేకంగా తెలంగాణ సమాజం చేసిన తిరుగుబాటు. ఆ తిరుగుబాటులో పాల్గొన్న వాళ్లు చాలా మంది మంత్రులయ్యారు. ప్రజా ప్రతినిధులు అయ్యారు. ముఖ్య మంత్రులు అయ్యారు. మరి అదే ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేను మాత్రం రాజద్రోహం కేసులు ఎదుర్కొంటున్నాను. కారణం ? అపరిష్కృతంగా ఉన్న తెలంగాణ ఉద్యమ నినాదాల కోసం పోరాడాను కాబట్టే నామీద కేసులు అయ్యాయి. వాటిని ఉద్యమ స్ఫూర్తి తోనే ఫేస్ చేస్తాను అన్నారు. రాష్ట్రంలో పట్ట భద్రులు ఎదుర్కొనే సమస్యలు వాటికి పరిష్కారాల విషయంలో అధికార ప్రతిపక్ష సభ్యుల తో బహిరంగ చర్చ కు సిద్ధమని ఖమ్మం చైతన్యవంతమైన పౌర సమాజం అందుకు చొరవ తీసుకోవాలని కృష్ణగౌడ్ విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తూ, నిరుద్యోగులు, ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు.రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, నిరుద్యోగ యువత భవిష్యత్తు, పట్టభద్రుల హక్కుల పరిరక్షణ కోసం తనకు మద్దతు ఇవ్వాలని నలమాస కృష్ణ విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు అర్వపల్లి విద్యాసాగర్ రావు, గోపా శ్రీనివాస్ గౌడ్,నాయకులు, టి జె ఎఫ్ జిల్లా కార్యదర్శి చిర్రా రవి, కోయ చంద్రమోహన్, సంగమేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి వేళ శివాలయాలకు పోటెత్తిన భక్తులు



జనం సాక్షి కొత్తగూడెం నవంబర్ 24 ఈరోజు కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలు శివాలయాలకు అధిక సంఖ్యలో చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పునీతులయ్యారు. రామవరం లోని ఎంతో ప్రాముర్యం పొందిన పురాతన శివాలయానికి భక్తులు తెల్లవారు నుంచి చేరుకొని ఆ మహా శివునికి అభిషేకం చేసి పూజలు నిర్వహించారు అర్చకులు కమిటీ సభ్యులు తగు సౌకర్యాలు కల్పించారు.

తప్పుడు ఆరోపణలు చేస్తూ, ఆసుపత్రి పై దాడి :డాక్టర్ మోహన్

కల్లూరు నవంబర్ 24 (జనం సాక్షి)

తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, కల్లూరు లో తన ఆసుపత్రి పై దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ మోహన్ స్పష్టం చేశారు. "ఆస్పత్రి ఎదుట మహిళ ఆందోళన శీర్షికన"వెలువడిన వార్తకు సంబంధించి డాక్టర్ మోహన్ మంగళవారం వివరణ ఇచ్చారు. 2020 సంవత్సరంలో తాను చంద్రగిరి కుసుమ శ్రీ నీ వివాహం చేసుకొని ఆ తర్వాత చట్టపరంగా కోర్టు ద్వారా 2024 లో విడాకులు తీసుకోవడం జరిగిందన్నారు. ఆ తర్వాత రెండో వివాహం చేసుకున్నానని డాక్టర్ మోహన్ తెలిపారు. మొదటి భార్య కు కలిగిన పాప మానసిక వికలాంగురాలు కావడం వల్ల నెలకు 15 వేల రూపాయలు చెల్లిస్తున్నాను అని చెప్పారు. మొదటి భార్య కుసుమశ్రీ తో తనకు చట్టపరంగా ఎటువంటి సంబంధం లేదని అయినప్పటికీ సోమవారం తను ఆసుపత్రిలో లేని సమయంలో మొదటి భార్య కుసుమ శ్రీ వెంట సిపిఐ పార్టీకి చెందిన చింతపల్లి రమేష్, పోటు కళావతి, రాచమల్ల సైదులు, చంద్రగిరి సత్యం, చంద్రగిరి హేమావతి వెంకటేశ్వర్లు, రాచమల్ల పద్మ, భాగ్య రావు, ఏ పూరి లలితా దేవి తో పాటు మరి కొంతమంది ఆసుపత్రిలో ప్రవేశించి మా ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందిని కొట్టారని డాక్టర్ మోహన్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి తాను పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆసుపత్రి పై దాడి చేసిన వ్యక్తులు 20 లక్షలు ఎకౌంట్లో వెయ్యాలని తనను హింసిస్తున్నారని డాక్టర్ మోహన్ చెప్పారు.ఈ విషయాలపై విచారణ జరిపించాలని డాక్టర్ మోహన్ కోరారు.

కల్లూరు పట్టణంలో రోడ్డు ప్రమాదం మహిళ మృతి, ఇద్దరికి గాయాలు



కల్లూరు నవంబరు 24(జనంసాక్షి).
కల్లూరు పట్టణంలోని సాంబ చికెన్ సెంటర్ సమీపాన హైవే ప్రధాన రహదారి పై అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా పల్సర్ ద్విచక్ర వాహనాన్ని నడిపి రెండు బైకులను ఢీకొట్టడంతో ఒక మహిళ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మంగళవారంఉదయం సుమారు 10 గంటల సమయంలో కల్లూరు మండలం, వాచ్యానాయక్ తండా గ్రామానికి చెందిన గుగులోతు కిషోర్ (తన తల్లి గుగులోతు కౌసల్య (69) తో కలిసి తనద్విచక్ర వాహనం పై కల్లూరులోని కరెంటు ఆఫీసుకు పని నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఉదయం సుమారు 10:45 గంటలకు కల్లూరు పట్టణంలోని సాంబ చికెన్ సెంటరు సమీపానికి చేరుకున్నారు. అదే సమయంలో వి.యం బంజరు వైపు నుండి కల్లూరు వైపుకు కల్లూరు పట్టణానికి చెందిన సయ్యద్ షబ్బీర్ తన పల్సర్ మోటారు సైకిలును అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి, ముందు వెళ్తున్న ఖాన్‌ఖాన్‌పేట గ్రామస్తుడు బాణోతు బాలు నడుపుతున్న ద్విచక్ర వాహనంను వెనుక నుండి బలంగా ఢీకొట్టాడు. అనంతరం అదుపుతప్పిన పల్సర్ వాహనం ముందు వెళ్తున్న గుగులోతు కిషోర్ ద్విచక్ర వాహనాన్ని కూడా వెనుక నుండి ఢీకొట్టడంతో వారు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాద ఘటనలో గుగులోతు కౌసల్య (69), తల వెనుక భాగంలో బలమైన తీవ్ర రక్త గాయం అయింది. స్థానికుల సహకారంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుగులోతు కిషోర్ కాలికి, చేతులకు అయినాయి . అదేవిధంగా ఖాన్ ఖాన్ పేట గ్రామానికి చెందిన బాణోతు బాలు కు గాయాలైనాయి . గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు గుగులోతు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాద బాధితుల ను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్రావు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన గుగులోత్ కౌసల్య భౌతికయని సందర్శించి కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలి కుటుంబానికి అండగా నిలబడతామని తెలిపారు, అదేవిధంగాగాయపడిన కిషోర్, బానోత్ బాలు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఈ సందర్భంగా నాయకులు భరోసా ఇచ్చారు. యాస శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణ శంకుస్థాపనకు 10 వేల మంది తరలిరావాలి

కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపు

దేవరకొండ, నవంబర్ 24 (జనంసాక్షి):
ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా మద్దిమడుగులో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంతో పాటు విగ్రహ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో దేవరకొండ నియోజకవర్గం నుంచి సుమారు 10 వేల మంది తరలిరావాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. అచ్చంపేట నియోజకవర్గంలోని హాజీపూర్‌లో నిర్వహించే సీఎం బహిరంగ సభకు 100 బస్సులతో పాటు సొంత వాహనాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ శ్రేణులు, బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై. ఏన్కూర్ పోలీసుల దాడి

ఐదుగురిపై కేసు నమోదు.. ఒకరి అరెస్ట్

రూ.7,500 నగదు, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఏన్కూర్, (జనంసాక్షి) :



కల్లూరు ఏసీపీ సాంబరాజు ఆదేశాల మేరకు ఏన్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగవాన్ నాయక్ తండా గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు చేపట్టిన ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పట్టుబడగా, పోలీసులను గమనించిన నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు. రమేష్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించి మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, రూ. 7,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదైన వారిలో రమేష్ ,కళ్యాణ్ కుమార్ ,కృష్ణ, రాజా ,శంకర్ ఉన్నారు. వీరంతా భగవాన్ నాయక్ తండాకు చెందినవారిగా పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా ఏసీపీ సాంబరాజు మాట్లాడుతూ పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

టేకులపల్లిలో కార్తీక పౌర్ణమి వేడుకలు



టేకులపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి):
కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని టేకులపల్లి మండలంలో మంగళవారం వేకువ జామునే భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. మండలంలోని పలు గ్రామాలలో ఆలయ ప్రాంగణాలలో తెల్లవారుజాము నుండి భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో, కొండంగల బోడులోని కొత్త కొండపై శ్రీ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో, కొప్పురాయి, సంపత్ నగర్ లోని ఆలయ ప్రాంగణాలలో తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేకువజామున శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం కార్తీక పౌర్ణమి సందర్భంగా లోకకల్యాణం, కుటుంబ సౌభాగ్యం, సుఖసంతో షాలు కలగాలని ఆకాంక్షిస్తూ బ్రహ్మంగారి ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామములో వేకువ జామునే లేచి మహిళలు, ఆడపడుచులు ఇంటి ముందల రంగురంగుల ముగ్గులతో అలంకరించి భక్తిశ్రద్ధలతో కార్తీకదీపంలను వెలిగించి కార్తీక పౌర్ణమి ఘనంగా జరుపుకున్నారు.



డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు రామావత్ రమేష్ నాయక్ జన్మదిన శుభాకాంక్షలు

దేవరకొండ, నవంబర్ 24(జనం సాక్షి)
బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 59వ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు రామావత్ రమేష్ నాయక్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి తిలకం దిద్ది, అక్షింతలు చల్లారు. అనంతరం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, విద్యా రంగంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని రమేష్ నాయక్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామావత్ మోహన్ కృష్ణ, చాట్ల చిరంజీవి, ముదిగొండ మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

సదా సాంబశివ సన్నిధిలో
పిడి శేఖర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు

కనగల్లు, నవంబర్ 24 (జనం సాక్షి)



కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని జి ఎడవెల్లి గ్రామంలో పురాతన పుణ్యక్షేత్రం శ్రీ సదా సాంబశివ ఆలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా మంగళవారం ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి శివనామ: స్మరణ నీ ధ్యానించారు. తన బాల్య దశ నుంచే ఈ దేవాలయానికి రావడం ఎక్కడ పూజలు నిర్వహించుకోవడం మాకు సాంప్రదాయమని సందర్భంగా పిడి శేఖర్ రెడ్డి దేవాలయ విశిష్టత గురించి వివరించారు. కార్తీక పౌర్ణమి అలాగే రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కాబట్టి ధర్వేశిపురం ఎల్లమ్మ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయం వద్దకు విచ్చేసి అమ్మవారి గర్భగుడి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేసిన అనంతరం అమ్మవారిని ప్రత్యక్షంగా దర్శించుకున్నారు .భక్తులకు గోత్రనామార్చన, కుంకుమార్చన కార్యక్రమాలు చేపట్టిన అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించగా కోరిన కోరికలు తీరిన భక్తులు కానుకలు, పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు

నిరుద్యోగ యువతకు అండగా నిలిచేది బీఆర్ఎస్ పార్టీనే

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్ఎస్
విజయానికి కృషి చేయాలి
నిరుద్యోగ యువతకు స్టడీ మెటీరియల్ అందజేత.



కోదాడ,(జనం సాక్షి):
కోదాడ పట్టణ పరిధిలోని సక్సెస్ స్టడీ సెంటర్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కలిసి బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ రాకేష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ఉద్యోగ నియామకాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, యువతకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు తగిన న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత సమస్యలను కేవలం ఎన్నికల సమయంలో ప్రస్తావించడం కాకుండా, వారి తరఫున చట్టసభల్లో నిరంతరం గొంతుకగా నిలిచి పోరాడే నాయకత్వం అవసరమని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించడం ద్వారా నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించే అవకాశం కలుగుతుందని తెలిపారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఆలోచించి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి తమ అమూల్యమైన ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్‌నినో సాకుతో రైతుల సమస్యలను పక్కదారి పట్టించొద్దు!

తుమ్మలచెరువును పూర్తిస్థాయిలో నింపాలి.. మారెళ్లపాడు పంపులు వెంటనే ప్రారంభించాలి..

రైతులకు కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలి : బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్

అశ్వాపురం,నవంబర్ 24 (జనంసాక్షి)

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ నాయకులు ఎల్‌నినో పేరుతో సాకులు చెబుతున్నారని అశ్వాపురం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోడి అమరేందర్ విమర్శించారు. రైతులకు సాగునీరు అందించకుండా రాజకీయ విమర్శలకు దిగడం సరికాదని అన్నారు.

గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నాయకత్వంలో మారెళ్లపాడు లిఫ్ట్ ప్రాజెక్టును నిర్మించి సుమారు 26 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రూపకల్పన చేశారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం పంపుల నిర్వహణ, విద్యుత్ సరఫరా పేరుతో మోటార్లు నిలిపివేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

తుమ్మలచెరువులో ప్రస్తుతం ఉన్న 17 అడుగుల



నీటితో సరిపెట్టకుండా చెరువును పూర్తిస్థాయిలో నింపాలని డిమాండ్ చేశారు. చెరువు నిండితేనే భూగర్భ జలాలు పెరిగి యాసంగి పంటలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో పంటలు మునుగుతాయనే కారణంతో నీటి విడుదల నిలిపివేయడం రైతులకు నష్టం కలిగిస్తుందని అన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నప్పుడు స్థానిక రైతుల చెరువులకు నీరు ఎందుకు అందించడం లేదో ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.తక్షణమే మారెళ్లపాడు లిఫ్ట్ పంపులను ప్రారంభించి తుమ్మలచెరువును పూర్తిస్థాయిలో నింపాలని కోడి అమరేందర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ప్రశ్నిస్తే రాజకీయం అంటున్నారని, రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.



వైభవంగా స్వామి కళ్యాణం, దీపాలంకరణ, పవళింపు సేవ

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 24 (జనంసాక్షి)

పవిత్ర కార్తీక పౌర్ణమి పర్వదిన సందర్భంగా, ఖమ్మం బ్రాహ్మణ బజార్లో వేంచేసి ఉన్న శ్రీ భూ నీలా సమేత లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో, భక్త జన సందోహం మధ్య కార్యక్రమ నిర్వాహకురాలు సరోజినమ్మ పర్యవేక్షణలో, ఆలయ అర్చకులు శేషు కుమార్, శ్రీనివాసచార్యులు, స్వామి అమ్మవార్ల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయంలో దీపాలంకరణ సేవ, పవళింపు సేవ కార్యక్రమాలు, భక్తి శ్రద్ధలతో కనుల విందుగా నిర్వహించారు. ఉదయం సాయంత్రం దైవ కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులకు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు సరోజిని అమ్మ మాట్లాడుతూ, భక్తులు దైవ కార్యక్రమాల నిర్వహణలో అధికంగా పాలు పంచుకోవాలని, తద్వారా ఆర్థిక సహకారాన్ని అందించాలని, ఆలయంలో క్రమం తప్పకుండా, కార్యక్రమాలు నిర్వహించడంలో సహకరించవలసిందిగా భక్తులను కోరారు. తద్వారా అతి ప్రాచీన ప్రశస్తి కలిగిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు.



పిఐఎల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

సూర్యాపేట (జనంసాక్షి):

ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర తొమ్మిదవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోకాళ్ళ రమేష్, కోల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలనే నినాదంతో తొమ్మిదవ రాష్ట్ర మహాసభలను సూర్యాపేటలో డిసెంబర్ 21, 22వ తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.నేటి యువతరం తమ హక్కుల కోసం పోరాడాలన్నారు.యువశక్తిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైన పాలకులను నిలదీయాలని పేర్కొన్నారు.ఈ మహాసభలలో సమగ్రమైన చర్చ జరిపి యువతరాన్ని ఐక్యం చేసి, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవాలని అన్నారు.రాష్ట్రంలో విద్య, వైద్యం దోపిడీకి గురవుతుందన్నారు.కార్పొరేట్ వైద్య వ్యవస్థపై తిరుగుబాటుకు సిద్ధం కావాలన్నారు.పిఐఎల్ రాష్ట్ర మహాసభలలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి ధరావత్ రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బివి చారి, జిల్లా అధ్యక్షులు నల్గొండ నాగయ్య, నాయకులు బండి రవి, పోలేబోయిన కిరణ్, గిరిబాబు, దండి ప్రవీణ్, పి.సురేష్, డి.ప్రవీణ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వడ్లను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

సంస్థాన్ నారాయణపురం. నవంబర్ 24. (జనంసాక్షి):

ఆరుగాలాలు కష్టపడి పండించిన వడ్లను అమ్ముకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తక్షణమే ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో చాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షం భయంతో ధాన్యం తడిసిపోతుందని ఆందోళన రైతులను వెంటాడుతుందని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి గింజను కొనుగోలు చేయడంతో పాటు సకాలంలో డబ్బులు చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తేమశాతం పేరుతో జాప్యం చేయకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ధాన్యం డబ్బులను ఎలాంటి కొర్రీలు లేకుండా చెల్లించాలని కోరారు. వడ్ల మ్యాచర్, అదేవిధంగా క్వింటాలుకు ఒక కిలో రెండు కిలోలు కటింగ్ చేసే పద్ధతిని మానుకోవాలని రైతులకు న్యాయం చేసే దిశగా సంబంధిత అధికారులు చూడాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు తోకల రామిరెడ్డి, రైతు సంఘంమండల ప్రధాన కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, పల్లె రాములు, ఈద మల్లయ్య, లక్ష్మణ్ నాయక్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నూతన కమిటీల ఎన్నిక

మాదిగల అభివృద్ధికి వర్గీకరణ కీలక మలుపు

విద్యార్థులు సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలి: భీమనపల్లి శంకర్

ముద్రగూడ/గట్టుప్పల్, నవంబర్ 24 (జనంసాక్షి)

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గట్టుప్పల్ మండలంలోని అంతంపేట, తేరట్‌పల్లి గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ గట్టుప్పల్ మండల అధ్యక్షుడు భీమనపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించడం మాదిగల సామాజిక న్యాయ పోరాటంలో చారిత్రాత్మక విజయమని అన్నారు. వర్గీకరణ చట్టం అమలుతో విద్య, ఉద్యోగ రంగాల్లో మాదిగలకు అవకాశాలు పెరిగి అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చూపిన మార్గంలో నేటి తరం విద్యార్థులు పయనించాలని, సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన గ్రామ కమిటీలను ప్రకటించి, నియామక పత్రాలను అందజేశారు.అంతంపేట ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా భీమనపల్లి మల్లేష్, అధికార ప్రతినిధిగా మాతంగి యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా మాతంగి లింగయ్య ఎన్నికయ్యారు. అంతంపేట ఎంఎస్ఎఫ్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కట్టా వంశీ, అధికార ప్రతినిధిగా భీమనపల్లి లోకేష్ నియమితులయ్యారు. తేరట్‌పల్లి ఎంఎస్ఎఫ్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా బొట్ట సైదులు, అధికార ప్రతినిధిగా బరిగెల రాకేష్ ఎన్నికయ్యారు. ఆయా కమిటీలకు ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఎంపిక చేశారు.ఈ కార్యక్రమానికి స్వాగత అతిథిగా గట్టుప్పల్ మండల ఎంఎస్పీ అధ్యక్షుడు తలారి సాయిలు, విశిష్ట అతిథిగా జిల్లా ఎంఎస్పీ నాయకుడు బరిగెల లింగయ్య హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు మాతంగి నరేందర్, జలందర్, రవీందర్, నర్సింహా, స్వామి, రవి, యాదయ్య, బొట్ట సైదులు, వరప్రసాద్, అబ్బయ్య, విక్రమ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి:సర్పంచ్ సైదిరెడ్డి

మాడుగులపల్లి నవంబర్ 24 (జనం సాక్షి):

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం పూసలపాడు గ్రామం సర్పంచ్ సైదిరెడ్డి కోరారు ఈ పథకం ద్వారా ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ?5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు ప్రజలందరికీ ఈ పథకం మరింత చేరువ కావాలనే లక్ష్యంతో పూసలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులలో పంచాయతీ అధికారులు, వార్డు సభ్యులు, సంబంధిత సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తారని సర్పంచ్ తెలిపారు పూసలపాడు గ్రామంలోని రేషన్ కార్డు కలిగిన అర్హులైన కుటుంబాలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ప్రజలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంబంధిత అధికారులను సంప్రదించి, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకెళ్లి తమ కుటుంబ సభ్యుల బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు ప్రతి కుటుంబానికి ప్రభుత్వ భరోసా అందాలనే సంకల్పంతో అధికారులు, ప్రభుత్వం వారికి కేటాయించిన సమయానుగుణంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు మీ కుటుంబ భద్రత మీ బాధ్యత అని, మీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ?5 లక్షల బీమా భరోసాను తప్పక వినియోగించుకోవాలని, ప్రతి అర్హులైన కుటుంబం ఈ పథకంలో వారి పేరును నమోదు చేసుకోవాలని సర్పంచ్ సైదిరెడ్డి కోరారు.



బలమైన ప్రజా ఉద్యమాలను స్వాగతించాలి : పోటు రంగారావు పిలుపు

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 24 (జనంసాక్షి)

సమకాలీన,, అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, పెట్టుబడి దారీ విధానం ప్రజలకు, వర్ధమాన ప్రపంచానికి, భారంగా మారిందని , దోపిడీ దారులకు అది స్వర్గంగా, ప్రజలకు అందకారంగా మారిందని , ఫలితంగా పెట్టుబడిదారీ ప్రపంచంలో ఉద్యమాలు బ్రద్దలవుతున్నాయని , ప్రజలకు, సమాజానికి బాధ్యత వహించే సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకత్వం ఆ పోరాటంలో కీలక భాగస్వామ్యం వ్యవహరించాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా)జిల్లా ప్లీనం సమావేశం జరిగింది. ఈ ప్లీనంలో పోటు రంగారావు హాజరై మాట్లాడుతూ, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదవిధానం మూడవ ప్రపంచ దేశాలను దోచుకున్నదని, దాని వలన ఆర్థిక సంక్షోభాలు వచ్చాయని వీటికి వ్యతిరేకంగా ప్రజలు బలమైన తిరుగుబాట్లు చేస్తున్నారని ,మనదేశంలో కూడా నరేంద్ర మోడీ సామ్రాజ్యవాద విధానాలకు మద్దతునిస్తున్నారని దేశ వనరులను బడా కార్పొరేట్ వర్గాలైన అ దాని, అంబానీలకు కట్టబెడుతున్నారని, పెట్టుబడి దారీ విధానాలను అమలు చేయడం వలన భారతదేశంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోభాలు ఏర్పడి ప్రజల జీవితాలు సంక్షోభ0 లో కూరుకుపోయినాయని ఆయన అన్నారు. మోడీ అధికారంలో కొచ్చి ప్రజలకు ఆచరణకు సాధ్యపడని వాగ్దానాలు చేసి మోసానికి పాల్పడినాడని ఆయన విమర్శించారు. దేశంలో



అధిక ధరలకు అంతులేకుండా పెరిగి పోయాయని నిరుద్యోగం తీవ్రంగా పెరిగిపోయి యువత తీవ్రమైన నిరాశ నిస్పృహలలో కొట్టుమిట్టాడు తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టుటకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చి రైతాంగాన్ని వ్యవసాయానికి దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిసెంబర్ 29న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా గర్జన మహా ప్రదర్శన,బహిరంగ సభలో హైదరాబాదులో నిర్వహిస్తున్నామని, దీనిలో ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగయ్యపార్టీ నిర్మాణం అంశంపై మాట్లాడుతూ,కమ్యూనిస్ట్ పార్టీలో కార్యకర్తలుక్రమశిక్షణ తో ప్రజలకు సేవచేయాలన్నారు.కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని ఆయనన్నారు.పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య తదితరులు ప్రసంగించారు.ప్లీనం సమావేశాలకు అధ్యక్షవర్గంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి రామయ్య, ఆవుల అశోక్, రాజు, శిరోమణి వ్యవహరించారు. ఈ సమావేశంలో కోలేటి నాగేశ్వరరావు, బండెల వెంకయ్య, ఏ వెంకటరెడ్డి, ఆర్ శివలింగం,కె రవి ఝాన్సీ, ఎస్ కె లాల్ మియా, కమ్మకోమటి నాగేశ్వర రావు,మలీదు నాగేశ్వరరావు,ఆవుల మంగతాయి,గంటా శ్రీనివాస్ రావు, కె శ్రీనివాస్,పి శోభ, టీ హన్మంతరావు,బి లాజరు,పృథ్వీ ఎన్ అజాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్తీక పౌర్ణమి వేళ మంచు పర్వతాల అలంకరణలో గుంటు మల్లేశ్వర స్వామి

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

ఖమ్మం , నవంబర్ 24 (జనంసాక్షి)

ఖమ్మం ట్రంకు రోడ్డులోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయం కార్తీక మాసం, కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడుతోంది. కార్తీక మాసం శివారాధనకు ఎంతో విశిష్టమైనది కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈరోజు గుంటు మల్లేశ్వర స్వామివారిని మంచు పర్వతాల ఆకృతిలో ప్రత్యేకంగా అలంకరించారు. మంచు పర్వతాల అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారిని చూసేందుకు భక్తులు ఆసక్తిగా ఆలయానికి చేరుకుంటున్నారు. భక్తులు శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తూ, పూలు, బిల్వపత్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కార్తీక దీపాలు వెలిగిస్తూ శివనామస్మరణతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుంటున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనడంతో దేవాలయం సందడిగా మారింది. భక్తుల శివనామస్మరణ, దీపాల వెలుగులు, మంచు పర్వతాల అలంకరణతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి.

అతిథి అధ్యాపకుల సమస్యల సాధనకు మద్దతు ఇస్తాం

డాక్టర్ కే. సురేందర్ రెడ్డి

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 24 (జనంసాక్షి)

అతిథి అధ్యాపకులకు టి జి సి జి టి ఏ మరియు టి సి ఈ జాక్ యూనియన్ల మద్దతు ఉంటుంది ? సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి,స్థానిక ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ డిగ్రీ కళాశాలలో ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట,



మహబూబాబాద్ జిల్లాల అతిథి అధ్యాపకుల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. సమావేశానికి విచ్చేసిన అధ్యక్షులు, చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు.అతిథి అధ్యాపకుల కు నెలవారీ జీతం, 12 నెలల కాలానికి పూర్తి జీతాలు, ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంటర్వ్యూ విధానాన్ని సంస్కరించే విధంగా సదస్సుకు హాజరైన అతిథి అధ్యాపకులను ఉద్దేశించి ప్రభుత్వా నికి, కాలేజియేట్ కమిషనర్ విద్యా విభాగానికి తెలియచేస్తూ ప్రతి అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కార దిశగా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించే అతిథి అధ్యాపకులకున్న డిమాండ్లను ప్రస్తావిస్తూ, కాంట్రాక్టు కమిషన్ విధానానికి తెలియజేస్తూ, అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కార దిశగా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. సంఘం తరుపున ఉన్నత విద్యా శాఖను ఒప్పించి అడ్వాన్సుగా అక్టోబర్, నవంబర్ మరియు డిసెంబర్ మూడునెలల బడ్జెట్ ను ఇప్పించడం జరిగిందని ఇది అతిథి అధ్యాపకుల చరిత్రలోనే గొప్ప విషయంగా చెప్పడం జరిగింది. జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అతిథి అధ్యాపకుల వేతనాలు, సమస్యలు చిక్కుముడులుగా ఉన్నాయని, ఉద్యోగ భద్రతతో పాటు మరెన్నో అంశాలుగా ఆచరణలోకి తీసుకురావాలని, యూనివర్సిటీ అల్మానాక్ తో సంబంధం లేకుండా రెగ్యులర్ అధ్యాపకులలో సమానంగా విధివిర్వహణ చేసేవిధంగా ప్రభుత్వాని ఒప్పించడానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ గోపీ మాట్లాడుతూ జె వి ఆర్ డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకుల సహకారంతోనే జరుగుతుందని తెలియచేశారు. సరైన వేతనాలు లేకున్న సమానపని చేస్తున్న అతిథి అధ్యాపకులు మా సంఘం తరుపున న్యాయం చేసేవిధంగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.బోధనేతర సిబ్బంది ఎఐ అడిషనల్ సెక్రటరీ జనరల్ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల కార్యాలయ సిబ్బందికి అతిథి అధ్యాపకుల జీతాలు ఇతర సమస్యలను ప్రాసెస్ ప్రాసీడింగ్స్ అందిన వెంటనే ట్రెజరీలకి పంపించే విధంగా సహకరిస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో డాక్టర్. కె.కిరణ్ కుమార్, ఖమ్మం అధ్యక్షులు డాక్టర్. పి.విజయ్ కుమార్, ఖమ్మం సెక్రటరీ మా. రాంబాబు, కాకతీయ యూనివర్సిటీ కోఆర్డినేటర్ రామకృష్ణారెడ్డి ,బి. వెంకన్న, కార్యవర్గం నిర్వాహకులు డాక్టర్ అభిజిత్ దేవ్, రాజిరెడ్డి, అప్పారావు, వేణు కృష్ణ ,రమేష్ కుమార్, డాక్టర్ వీరు నాయక్, డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ వీరన్న డాక్టర్ నవీన్, క్రాంతికుమార్, ఆనందరావు, పాల్వంచ శ్రీను, విమల, ఈశ్వర్,నగేష్ రాజేష్, మహబూబ్ బకాష్, లక్ష్మీనారాయణ, రవి, అరుణ, రఘుపతి, మురళీమోహన్, ఉషా పావని, నాగరాజు, తెలుగు శ్రీను, రమేష్, రహమాన్, గార్ల రాజేష్, రాజులక్ష్మి, సోమేశ్వర్, రవి, వేణు పవన్, వీరస్వామి, డాక్టర్ ఉపేందర్ ఈశ్వర్ బాబు ప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొల్లి సత్యనారాయణకు మద్దతుగా విస్తృత ప్రచారం



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 24 (జనం సాక్షి)

త్వరలో జరగనున్న వరంగల్- ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి కొల్లి సత్యనారాయణను గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పిడిఎఫ్ అభ్యర్థి కొల్లి సత్యనారాయణ స్టేడియంలో వాకింగ్ చేస్తున్న వారిని, వ్యాయామం చేస్తున్న పట్టభద్రులను, నిరుద్యోగ యువతను, ఉద్యోగులను, రిటైర్డ్ ఉద్యోగులను, క్రీడాకారులను, చిరు వ్యాపారులను వ్యక్తిగతంగా కలుసుకుని ఓటు అభ్యర్థించారు. ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను, ఉద్యోగుల హక్కులను, క్రీడాకారుల ఇబ్బందులను, చిరు వ్యాపారుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల గొంతుకగా శాసనమండలిలో పనిచేస్తానని, చట్టసభ గౌరవాన్ని కాపాడేలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. అన్ని ప్రజా సంఘాలు, పౌర సమూహాలు, మేధావుల మద్దతుతో ఎన్నికల బరిలో నిలిచిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆదరించాలని కోరారు. లౌకిక, ప్రజాస్వామిక ఆకాంక్షల సాధనకు, రాజ్యాంగ విలువల పరిరక్షణకు సామాజిక స్పృహతో నిరంతరం పనిచేస్తున్న తనను గెలిపించాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్, వై. విక్రమ్, బండారు రమేష్, యం. సుబ్బారావు, పిట్టల రవి, నందిపాటి మనోహర్, బోడపట్ల రవీందర్, బుర్రి వెంకన్న, కుటుంబరావు, జె. నాగేశ్వరరావు, బొమ్మిశెట్టి శ్రీనివాస్, న్యాయవాదులు ఏడునూతల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, పాపారావు, లక్ష్మీనారాయణ, డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి



రోడ్డు ప్రమాద బాధితులకు
రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం

పీఎం రాహత్ పథకం ద్వారా నగదు రహిత చికిత్స..

జిల్లాలో తొలి కేసు విజయవంతం

భద్రాచలం నవంబర్ 24 (జనంసాక్షి)

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించి ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకం కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి కేసు విజయవంతంగా నమోదైంది.రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్వరాజ్యం అనే బాధితురాలికి భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ఈ పథకం ద్వారా సుమారు రూ. 22 వేల విలువైన వైద్య సేవలను నగదు రహితంగా అందించారు. దీంతో బాధితురాలిపై ఆర్థిక భారం పడకుండా అవసరమైన చికిత్స అందించేందుకు అవకాశం కలిగింది. పథకం కింద అందించే వైద్య చికిత్స ఖర్చులను టీ.ఎం.ఎస్. 2.0 పోర్టల్ ద్వారా జిల్లా కలెక్టర్ లాగిన్ నుంచి సంబంధిత ఆసుపత్రికి చెల్లించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ విధానం ద్వారా ప్రమాద బాధితులు డబ్బుల కోసం ఇబ్బందులు పడకుండా సకాలంలో వైద్య సేవలు పొందవచ్చు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు స్వరాజ్యాన్ని భద్రాచలం సీఐ రాజు, జిల్లా డీఆర్ఎం బాలాజీ, ఆరోగ్యశ్రీ మిత్ర సుధాకర్, ఆసుపత్రి సిబ్బంది పరామర్శించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం బాలాజీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం రాహత్ పథకం ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రికి తరలించి తక్షణ వైద్యం అందేలా చూడాలని కోరారు. పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత విభాగాల సమన్వయంతో జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మారెళ్లపాడు సాగునీటిపై రాజకీయ డ్రామాలు వద్దు..
రైతులను తప్పుదోవ పట్టించొద్దు!

రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యం : ఓరుగంటి రమేష్ బాబు



అశ్వాపురం, నవంబర్ 24 (జనంసాక్షి): మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ విషయంలో బీఆర్ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం రైతులను రెచ్చగొడుతూ అసత్య ప్రచారం చేయడం మానుకోవాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు హితవు పలికారు.మంగళవారం అశ్వాపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలినినో ప్రభావంతో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించి పంటలను కాపాడినట్లు తెలిపారు.మారెళ్లపాడు లిఫ్ట్ ప్రారంభానికి ముందు తుమ్మలచెరువులో 6 అడుగుల నీటిమట్టం ఉండగా, ప్రస్తుతం 17 అడుగులకు చేరిందని వెల్లడించారు. అంతకుమించి నీటిని నిల్వ చేస్తే లోతట్టు ప్రాంతాల్లో పంటలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, రైతుల పంటలకు నష్టం జరగకుండా నీటి నిల్వలపై జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. పంటల కోత పూర్తయిన తర్వాత అవసరాన్ని బట్టి తిరిగి పంపులు నడిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా ప్రస్తుతం ఖరీఫ్ చివరి తడి అవసరాలు, తాగునీటి నిల్వల కోసమే జరుగుతోందని, వేసంగి పంటల కోసం నీటిని తరలిస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యత అని, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని రమేష్ బాబు పేర్కొన్నారు.రైతుల సమస్యలపై నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్ష నాయకులు రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా వాస్తవాలను తెలుసుకోవాలని, రైతులను రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని ఆయన సూచించారు.



నీలాద్రికి శివాలయానికి అయ్యప్ప స్వాముల పాదయాత్ర

పెనుబల్లి, నవంబర్ 24 (జనంసాక్షి)

మాల ధారణ స్వాములకు, భక్తులకు, మహిళలకు అత్యంత ప్రీతిపాత్ర మైనమాసం కార్తీక మాసం, ఈ కార్తీకమాసంలో వచ్చే అత్యంత పవిత్రమైన రోజు కార్తీక పౌర్ణమిరోజు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు భక్తి శ్రద్ధలతో కాలినడకన పెనుబల్లి గ్రామం నుండి భవన్నపాలెం గ్రామపంచాయతీ అటవీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ ప్రాచీన శివాలయం నీలాద్రి దేవస్థానంకు తరలి వెళ్లారు.

శివనామా స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు





మణుగూరు, నవంబర్ 24 (జనంసాక్షి)

పవిత్ర కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మణుగూరు వ్యాప్తంగా శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీతో ఆలయాలన్నీ శివ నామస్మరణలతో మార్మోగుతున్నాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.అభిషేకాలు, అర్చనలు శివలింగానికి పంచామృతాలు, రుద్రాభిషేకం, మారేడు దళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రాంగణాలలో ఉసిరి లేదా తులసి చెట్ల వద్ద, నదుల్లో దీపాలు వెలిగిస్తున్నారు. 365 వత్తులతో దీపారాధన చేయడం విశేషంగా భావిస్తారు. నదీ స్నానాలు ఆచరించి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఓం నమః శివాయ నామా స్మరణతో శైవ క్షేత్రాలలో మార్మోగాయి..

అంగరంగ వైభవంగా అయ్యప్ప దీక్షాపరుల ఇరుముడి కార్యక్రమం

కల్లూరు నవంబర్ 24 (జనంసాక్షి)

కల్లూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో గల శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవ కార్యక్రమం మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా కోలాహలంగా జరిగింది. కేరళ రాష్ట్రంలోని శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధానం వెళ్ళుటకు 41 రోజులు పాటు కఠోర నియమనిష్టలతో అయ్యప్ప మాల ధరించిన భక్తులు దీక్షాకాలం పూర్తయిన నేపద్యంలో శబరిమలై తరలి వెళ్లేందుకు పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకొని అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవం గురుస్వామి కోనందల రాధాకృష్ణ నాయర్ ఆధ్వర్యంలో శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో చేపట్టారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతో ఆలయ ప్రాంగణం అంతా పండుగ సందడి నెలకొన్నది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రముఖులు, శ్రేయోభిలాషులు బంధువులు, ఆలయంలో మూలవిరాట్ దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. అనంతరం అయ్యప్ప దీక్షాపరులకు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్రావు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవ కార్యక్రమంలో, భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాదం కార్యక్రమంలో పుర ప్రముఖులు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, బొల్లం రామారావు, బొల్లం శంకర్ గౌడ్ రాధా దంపతులు,, బొల్లం ఉపేందర్, మున్సిపాలిటీ కౌన్సిలర్ లు దాసరి సుధారాణి, యాస నాగమణి శ్రీకాంత్, గుండ్ల పుల్లారావు, డాక్టర్ లక్కినేని రఘు, పలువురు పుర ప్రముఖులు కన్నె కంటి కృష్ణమూర్తి, కన్నెకంటి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మేక కృష్ణయ్య,.. కొండపల్లి వేణుగోపాలరావు, కోటికలపూడి కళ్యాణ కిషోర్, బొల్లం వెంకటేశ్వరరావు, మీసాల కృష్ణ,అయ్యప్ప దీక్షాపరులు ధూప కుంట్ల మురళీ, బొల్లం నాగేంద్ర కుమార్, బొల్లం మల్లికార్జున్, కన్నె కంటి వాసు,బెల్లంకొండ శ్రీకాంత్, బొడ్డు తిరుపతిరావు, నోముల రాటాలు, బొల్లం అవినాష్, శ్రీలం నాగరాజు, కొండపల్లి సాయి మాధవ్, గండు హుస్సేన్, బొడ్డు రాఘవులు, బండి రవి, ముత్తవరపు సీతారామయ్య, జోనబోయిన విష్ణు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



ఆగ్రిగోల్డ్ బాధితులారా అప్రమత్తం కండి

ఖమ్మం నగర పోలీస్ శిక్షణ కేంద్రంలో బాండ్ల ధృవీకరణ!

గడువు లోపే వివరాలు నమోదు చేసుకోండి: చింతకాని

ఎస్పై జి నరేష్ సూచన!



చింతకాని , నవంబర్ 24 (జనంసాక్షి)

చింతకాని మండల పరిధిలో ఆగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేసి బాధితులుగా మిగిలిన వారు ఎవరైనా ఉంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చింతకాని ఎస్సై జి. నరేష్ సూచించారు. బాధితులు తమ వద్ద ఉన్న ఆగ్రిగోల్డ్ బాండ్లను తీసుకొని ఖమ్మంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ధృవీకరణ కేంద్రానికి వెళ్లి వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ఖమ్మంలోని నగర పోలీస్ శిక్షణ కేంద్రం పాత పోలీస్ కమిషనర్ కార్యాలయం పోలీస్ హెడ్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం 25.11.2026 నుంచి 15.05.2027 వరకు పనిచేస్తుందని వెల్లడించారు. చింతకాని మండలానికి చెందిన బాధితులు తమ అసలు బాండ్లతో పాటు ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను వెంట తీసుకెళ్లి ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే కేంద్రాన్ని సందర్శించి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని ఎస్సై నరేష్ కోరారు.



ఈ నెల 29న కార్తీక వన సమారాధన

సూర్యాపేట(జనంసాక్షి):
ఈనెల 29న పాత సూర్యాపేట స్టేజి వద్ద గల శ్రీసంతోషిమాత ఉద్యానవన క్షేత్రంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీసంతోషి రూపాదేవి సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశం గుప్తా, బ్రహ్మోండ్లపల్లి మురళీధర్ తెలిపారు.మంగళవారం శ్రీసంతోషిమాత దేవాలయంలో 25 వ కార్తీక వన సమారాధన కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.గత 24 సంవత్సరాలుగా సూర్యాపేట శ్రీసంతోషి మాత దేవాలయం ఆధ్వర్యంలో శ్రీసంతోషి రూపాదేవి సేవాసమితి సహకారంతో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం,పార్దివ లింగాభిషేకం, గంగానది దీపోత్సవం, కాశీ నుండి తెచ్చిన 108 శివ లింగాలతో మహాన్యాస రుద్రాభిషేకం, తులసి పూజలు, ఆమలక పూజలు , సంతోషిమాత పూజలు, మ్యూజికల్ చైర్స్, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక మాస వన సమారాధనలో స్వామి ప్రసాదంను స్వీకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, సోమ శ్రీశైలం, ముదిరెడ్డి లింగారెడ్డి, దేవరశెట్టి సోమయ్య, తాళ్లపల్లి రామయ్య, మహంకాళి ఉపేందర్, గోపారపు రాజు, వందనపు వెంకటేశ్వర్లు, కక్కిరేణి పద్మ, కనక రత్నం, యాస వెంకట్ రెడ్డి , అర్చకులు అశోక్ మిశ్రా, రాఘవాచార్యులు దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని దేవాలయంలో దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు



పేద కుటుంబానికి పెద్ద కష్టం

ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధితుడి భార్య వేడుకోలు

నడిగూడెం (జనంసాక్షి) :
నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన పాపగంటి ఉప్పలి లివర్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతూ ఖమ్మం పట్టణం లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నాడని వైద్యానికి 2 లక్షల పైగా ఖర్చు అవుతుందని డాక్టర్స్ చెప్పుతున్నారని రెక్కాఆడితే డొక్కాడని మా కుటుంబానికి పెద్ద దిక్కు అయిన నా భర్త వైద్యానికి దాతలు మానవత్వంతో ముందుకు వచ్చి ఆర్థికంగా సహకరించాలని బాధితుడి భార్య స్వాతి వేడుకుంటుంటుంది.తోటి హామలీలు ఖమ్మం హాస్పిటల్ లో బాధితుడిని పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

ఆరుతడి పంటల సాగుతో లాభాలు

జాజిరెడ్డిగూడ(జనంసాక్షి):
ఎల్‌నినో వలన వర్షాలు పడక కరువు ఏర్పడినందున రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగుచేసి లాభాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి పి.గణేష్ కోరారు. మంగళవారం వేల్పుచర్ల గ్రామంలో సాగుకాని వ్యవసాయ భూములను పరిశీలించి రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించారు. గ్రామంలో సాగవుతున్న కంది, ఇతర ఆరుతడి పంటలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ సత్యం, వార్డు సభ్యుడు మధుసూదన్, రైతులు ఖమ్మంపాటి జానయ్య, చిక్కుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.





అర్హులందరికీ చేయూత పింఛన్లు

జాజిరెడ్డిగూడ(జనంసాక్షి):
అర్హులైన వారందరికీ ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేస్తుందని సూర్యానాయక్‌తండా సర్పంచ్ లూనావత్ కృష్ణనాయక్ అన్నారు. మంగళవారం తండాలో గ్రామ సభను నిర్వహించి లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, చేపట్టబోయే అభివృద్ధి పథకాల గురించి చర్చించారు. ఈకార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి సీహెచ్.మహేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.

సినీ నిర్మాత అప్పిరెడ్డికి ఘన స్వాగతం



మునగాల, నవంబర్ 24(జనంసాక్షి):
మండల పరిధిలోని నర్సిం శ్రీహాపురం గ్రామంలో జరుగుతున్న కార్తీక పౌర్ణమి వేడుకల సందర్భంగా శ్రీ కోదండరామస్వామి కళ్యాణ మహోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్తున్న ప్రముఖ సినీ నిర్మాత, మైక్ టివి చైర్మన్ అన్నపరెడ్డి అప్పిరెడ్డికి మునగాల మండల కేంద్రంలో పలువురు ద్వారా ఘన స్వాగతం లభించింది. ఐటీ రంగంలో పనిచేస్తున్న యువతీ యువకులు, గ్రామస్థులు ముచ్చటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగెపు నర్సింహారావు, శెట్టి గిరి, బెజవాడ గోవర్ధన్, చింతకాయల యల్లయ్య, గోపి, నాగుల్ పాషా, సీతారాం, ఆలేటి మహేష్, పాతకోట్ల నాగరాజు, పిట్టల గోపి, శివకృష్ణ, జిల్లేపల్లి గోపి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

నడిగూడెం (జనం సాక్షి) :
నడిగూడెంలోని సాయి మందిరంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నడిగూడెం శిరిడి సాయిబాబా మందిరంలో మంగళవారం గోపూజ ప్రత్యేక అభిషేకం సాయంత్రం కార్తీక దీపోత్సవం జ్వాలాతోరణం సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి మందిరంలో కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో సాయి సేవా సమితి అధ్యక్షుడు పందిరి వెంకటరెడ్డి, సభ్యులు మహేష్, బాలాజీ నాయక్, ఎంవి రమణారావు, దివ్వెల శ్రీనివాస్, ఉపేందర్, సూర్య, ప్రకాశరావు, దయాకర్, మందిర పూజారి రాజశేఖర్ శర్మ, కిషోర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ కూనూరు లక్ష్మణ్ గౌడ్ కు పితృవియోగం

నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, నవంబర్ 24 (జనంసాక్షి):
హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ గౌడ్ తండ్రి, భోగారం మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కూనూరు గోపాల్ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై నివాళులర్పించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ గౌడ్ తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్, జిల్లా డిసిసి కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నందాల బిక్షం రెడ్డి జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి, గంపల రామచంద్రారెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ఎండి జమీరుద్దీన్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బట్టే సంతోష్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు గోగు హరిప్రసాద్,మోటే రమేష్,మాజీ సర్పంచ్ గుత్తా నర్సిరెడ్డి, బొడ్డు సురేందర్ రావు,రామిని రమేష్, ఎండి అక్రమ్, గొలుసుల ప్రసాద్, మిర్జా ఇనాయత్ బేగ్ తదితరులు ఉన్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

